www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 నవంబర్ 2025
5
తూర్పుగోదావరి



జ్యూట్ బ్యాగ్, మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంలోని ఆల్కట్ గార్డెన్స్ వద్దనున్న యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ, మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని సంస్థ డైరెక్టర్ తాడి.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత, భోజన వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. కనీసం పదవ తరగతి ఉత్తీర్ణులై, 19 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డ్, పదో తరగతి మార్కులిస్టు, రెండు ఫొటోలు, బ్యాంక్ పాస్ బుక్, కేస్ట్ సర్టిఫికెట్ కాపీలతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 0883-2420242,2428807, 9700765169, 9700765169, 9701359954 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలకు బ్రేక్



- వినికిడి సమస్యతో జన్మించే చిన్నారులకు ఈ శస్త్రచికిత్స వరం
- సుమారు రూ.10లక్షల వరకూ వ్యయం
- ఎన్‌టిఆర్ వైద్య సేవలో ఉచితంగా నిర్వహణ
- ఆడిట్ పేరుతో నాలుగు నెలలుగా నిలిపివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలకు బ్రేక్ పడింది. పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడే చిన్నారుల జీవితాల్లో ఈ సర్జరీ వెలుగులు నింపుతుంది. అత్యంత ఖరీదైన ఈ శస్త్ర చికిత్సలను ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకంలో ఉచితంగా అందిస్తున్నారు. అయితే నాలుగు నెలలుగా ఈ శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ఇప్పటివరకూ జరిగిన వాటికి సంబంధించి ఆడిట్‌ను నిర్వహిస్తున్నందున తాత్కాలికంగా శస్త్ర చికిత్సలు నిలిపివేయాలంటూ జిల్లాలోని ఆస్పత్రులకు ఆదేశాలు అందాయి. ఈ శస్త్ర చికిత్స 11 నెలల వయసు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు మాత్రమే చేస్తుంటారు. మూడేళ్లలోపు చేయించుకుంటే మెరుగైన ఫలితం లభిస్తుంది. చిన్నారుల్లో సమస్యను తల్లిదండ్రులు సకాలంలో కనుగొనలేకపోతున్నారు. మూడు, నాలుగేళ్లు దాటిన తరువాత కొందరు, ఐదేళ్లు వచ్చిన తరువాత మరికొందరు గుర్తించగలుగుతున్నారు. చిన్నారులకు వివిధ రకాల పరీక్షలు చేసి, వారు శస్త్రచికిత్సకు అర్హులు అని నిర్ధారించేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. ఈలోగా వయసు ఐదేళ్లకు మించకూడదు. ఈ నేపథ్యంలో చాలామంది చిన్నారులకు వయసు దాటి పోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను నగరంలోని అంజనా హాస్పిటల్‌లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహించడానికి ముందు చిన్నారికి ఆస్పత్రి అధికారులు పరీక్షలు నిర్వహించి, అనంతరం అమర్చాల్సిన పరికరం కోసం ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్టుకు ఇండెంట్ పెడతారు. ప్రభుత్వమే ఆయా పరికరాలను కొనుగోలు చేసి ఆస్పత్రులకు సరఫరా చేస్తుంది. ఒకేసారి నెలకు ముగ్గురు, నలుగురు చిన్నారులకు అవసరమైన పరికరాల కోసం అధికారులు ఇండెంట్ పెడుతూ ఉంటారు. ఇలా పరికరాలు వచ్చిన తరువాత చిన్నారులకు శస్త్రచికిత్సలను నిర్వహిస్తారు. శస్త్రచికిత్స అనంతరం సదరు చిన్నారులకు స్పీచ్ థెరపీ వంటివి ఉచితంగా అందిస్తారు. సాధారణ స్థితికి తీసుకువస్తారు. ఈ శస్త్రచికిత్సను బయట చేయించుకోవాలంటే సుమారు రూ.8 లక్షలు నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని భరించి ఎన్‌టిఆర్ వైద్య సేవలో చేస్తుండడంతో ఎంతోమంది చిన్నారులకు మేలు చేకూరుతోంది. తాజాగా ఈ శస్త్ర చికిత్సలు అందుబాటులో లేకపోవడంతో అవసరమైన చిన్నారుల తల్లిదండ్రులు ఈ సేవల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

త్వరలోనే అందుబాటులోకి...

కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఆడిటింగ్ నేపథ్యంలో ఈ సేవలు అందుబాటులో లేవు. రాష్ట్రంలో అనుమతులు ఉన్న హాస్పిటల్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా ఈ సేవలను ఎక్కడైనా వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం జిల్లాలో ఒక దరఖాస్తు మాత్రమే పెండింగ్‌లో ఉంది. ఈ సేవలు అందుబాటులోకి రాగానే తెలియజేస్తాం.

- డాక్టర్ ప్రియాంక, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

కమిషనర్ రాహుల్ మీనా



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై చెత్త, ఇతర వ్యర్థాలను వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సిబ్బందిని ఆదేశించారు. నగరపాలక సంస్థ వీఈఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతం ఉన్న గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను(జీవీపీ) తక్షణం తొలగించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉత్పత్తిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రతి రోజూ పారిశుధ్య కార్మికులు ఎంత మంది విధుల్లో ఉన్నారో రికార్డులు ఉండాలన్నారు. ఉదయం 6.30 నాటికి డోర్ టూ డోర్ చెత్త సేకరణ మొదలు కావాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా జరగాలన్నారు. వీధి వ్యాపారులు, హోటళ్లు, టీ పాయింట్లు, జ్యూస్ స్టాల్స్ యజమానులు తప్పని సరిగా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. హాస్పిటల్ పరిసరాల్లో మెరుగైన శానిటేషన్‌ను నిర్వహించాలన్నారు. చెత్త సేకరణ వాహనాల కండిషన్ ను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను తప్పని సరిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌ఒ వినూత్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్ వైజర్లు, బయాలజిస్ట్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌ఎఫ్‌సి భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం ఎంఎస్‌ఎం పార్కు ప్రాంగణంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్(ఎఫ్‌ఎఫ్‌సి) భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి హాజరయ్యారు. ప్రధాన అతిథిగా కలెక్టర్ కీర్తి చేకూరి, శాసన మండలి సభ్యుడు సోము వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే 12 పరిశ్రమలు విజయవంతంగా పని చేస్తున్నాయి. యువతకు 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో నైపుణ్యం పెంచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. వీటి ద్వారా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తుల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. పారిశ్రామిక వేత్తలకు ఇది మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా యువతకు ఆమె సూచించారు. ఎఫ్‌ఎఫ్‌సి వివరాలను గోరంట్ల బుచ్చయ్యచౌదరి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 26 యూనిట్లు స్థాపిస్తామన్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 34,444.51 చదరపు అడుగులు కాగా, ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.5.15 కోట్లుగా ఉందన్నారు. ఇది సూక్ష్మ మరియు చిన్న స్థాయి యూనిట్లకు 'ప్లగ్ అండ్ ప్లే' సౌకర్యాలను అందించే ఆధునిక పారిశ్రామిక భవనం అవుతుందన్నారు. ఎంఎల్‌సి సోము వీర్రాజు మాట్లాడుతూ 'ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త' అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జెసి వై.మేఘ స్వరూప్, ఎపిఐఐసి లిమిటెడ్ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, డిఐఒ శ్రీవనిధర్ రామన్, కడియం ఎంపిపి వి.ప్రసాద్, ఎంఎస్ఎంఇ చైర్మన్ జార్జిబాబు, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, ఎఎంసి చైర్మన్ మార్ని వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న కలెక్టర్ కీర్తి, ఎంఎల్ఎ గోరంట్ల

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు కొలతలు తీస్తున్న సిబ్బంది. పర్యవేక్షిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం ప్రధాన రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. అనేకేళ్లుగా భారీ గుంతలతో కూడిన ఈ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 12న మంత్రి కందుల దుర్గేష్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.1.20 కోట్లతో 970 మీటర్ల పొడవు 6 మీటర్ల వెడల్పు తో జాతీయ రహదారి నుంచి కె.సావరం, చివటం వరకూ రోడ్డు నిర్మాణం ప్రారంభించినట్లు డిఇఇ కె.రామ్మోహనరావు తెలిపారు. సుమారు మూడు నెలల పాటు రోడ్డు నిర్మాణ పనులు జరిగే అవకాశం ఉందని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని ఎఎ ఎన్.ఏడుకొండలు సూచించారు. ఈ పనులను చివటం కూటమి నాయకులు, ఎంపిటిసి వేముల వెంకట సత్య నారాయణ, చిలుకూరి శ్రీనివాస్, తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో చివటం ఇంజినీరింగ్ అసిస్టెంట్ సిహెచ్.ఆకాంక్ష పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

'భూమాత రక్షణ'పై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధికం అవుతున్నట్లు గమనించిన సందర్భంగా, ఎరువుల వివేకవంతమైన వినియోగంపై ధాత్రీ మాతా బచావో నిగ్రాణి సమితి పలు కార్యాచరణ మార్గదర్శకాలు విడుదల చేసినట్లు ఎఒ బి.రాజారావు తెలిపారు. మంగళవారం పాలంగి, కె సావరం, ఉండ్రాజవరం, మోర్త, తాడిపర్రు, వెలగదుర్రు, చివటం గ్రామాల్లో ఈ మేరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిం చారు. అధిక ఎరువులు, పురుగు మందుల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

నల్లజర్ల : భూమాతను రక్షించుకోవడం అందరి బాధ్యతని నల్లజర్ల మండల వ్యవసాయ అధికారి బి.సోమశేఖర్ అన్నారు. మండలంలోని అయ్యవరం గ్రామంలో మంగళవారం పొలంపిస్తుంది, భూమాత రక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ భూమికి ఎక్కువగా పురుగు మందులు వాడడం వల్ల భూమి తన సారాన్ని కోల్పోయి, స్వరూపం మారిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ డి.పుష్పలత, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ ఐడీతో మెరుగైన సేవలు

ప్రజాశక్తి - రాజానగరం

అపార్ ఐడీ ద్వారా విద్యార్థులకు మెరుగైన సేవలు అందుతాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మంగళవారం యూనివర్సిటీ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ సహకారంతో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌నకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు నుంచి ఎబిసి నోడల్ ఆఫీసర్లు, కో-ఆర్డినేటర్లు, ప్రిన్సిపల్స్ సుమారు మూడు వందల మంది హాజరయ్యారు. యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డి.కళ్యాణి కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసి ప్రసన్నశ్రీ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ డాక్టర్ పి.అనిల్ కుమార్, అకడమిక్ కన్సల్టెంట్ బి.ఎల్లారెడ్డి, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ రీజినల్ కో-ఆర్డినేటర్ రవి పాండే హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ అమలుపై జాతీయ విద్యా విధానం-2020 కింద ఒక వినూత్నమైన, పరివర్తన కలిగించే ప్రక్రియ మొదలైందన్నారు. అపార్ యొక్క ప్రగతిశీల అమలును చూడటం చాలా సంతృప్తిని ఇస్తుందన్నారు. ప్రతి అభ్యాసకుడికి జీవితాంతం, ప్రత్యేకమైన 12-అంకెల గుర్తింపు సంఖ్యగా భావించబడే అపార్ ఐడి "ఒక దేశం, ఒక విద్యార్థి, ఒక ఐడి" యొక్క దార్శనికతను ప్రతిబింబిస్తుందన్నారు. సమగ్రమైన జీవితకాల విద్యా రికార్డును ఇది అందిస్తుందన్నారు. అనిల్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అపార్ ఐడీలు వందశాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. రవి పాండే అపార్ ఐడీ లకు సంబంధించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అందించారు. డీన్ డి.కళ్యాణి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో భాగంగా అపార్ ఐడి లక్ష్యాలను సాధించే దిశగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాప్సీ అకడమిక్ కన్సల్టెంట్ బి.ఎల్లారెడ్డి, శ్రీకాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.దీప్తి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ ఎవిఎం.జ్యోతి, విశ్వవిద్యాలయ పరీక్ష విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విసి ప్రసన్నశ్రీ



డిఎంహెచ్ఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీదేవి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా శ్రీదేవి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ బి.శ్రీదేవి మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డిఎంహెచ్ఒను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదే విధంగా డిప్యూటీ డెమోగా పి. సత్యవతి కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బి.శ్రీదేవి మాట్లాడుతూ, జిల్లాలో జరుగుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తానన్నారు.

17 నుంచి లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వ్యాప్తంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను ఈ నెల 17 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ముందుగా గుర్తిస్తే లెప్రసీని పూర్తిగా నివారించొచ్చని కలెక్టర్ తెలిపారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, బొడిపెలు, నరాల సమస్యలున్న వారు సమీపంలోని ఆసుపత్రులను సంప్రదించాలన్నారు. చికిత్స, మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెసి వై.మేఘస్వరూప్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్.వసుంధర, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు నూతనంగా ఎన్నికైన కమిటీలకు సూచించారు. మంగళవారం నేలటూరు శ్రీ సీతారామ స్వామి కళ్యాణ మండపంలో టిడిపి మండల, గ్రామ, అనుబంధ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఎంఎల్ఎ ముప్పిడి నూతన కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సభ్యులు పార్టీ సిద్ధాంతలకు ఆశయాలకు కట్టుబడి సేవా భావంతో పనిచేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఈ కమిటీలదేనన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే నాయకుడికి ఓపిక, సహనం ఉండాలన్నారు. టిడిపి మండల అధ్యక్షునిగా చిటికెన పెంటారావు, కార్యదర్శిగా బొడ్డు కేశవకుమార్, చాగల్లు పట్టణ అధ్యక్షునిగా దొంగ రామకృష్ణ సహా నూతన కమిటీ సభ్యులను పూలమాలలతో సత్కరించి అభినందించారు. కొవ్వూరు నియోజకవర్గం పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ఎఎంసి చైర్మన్ నాదల శ్రీరామ్, ఎఎంసి మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కురుటూరి సతీష్, గారపాటి శ్రీనివాస్‌రావు, కె.సాహెబ్, బి.శివనాగేంద్ర, వై.అబ్బులుచౌదరి, కోడూరు కాశిగంగాధరరావు, తాళ్లూరు ప్రసాద్, జొన్నకోటి సుబ్బారావు, ఈడుపుగంటి సుబ్బారావు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ప్రమాణస్వీకారంచేస్తున్న నూతన కమిటీల సభ్యులు

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి- గోపాలపురం


మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపిడిఒ జి.రాజ్‌మనోహర్, తహశీల్దార్ ఎంవి.సాయిప్రసాద్ అన్నారు. మంగళవారం చిట్యాలలో ఆశ్రం హాస్పిటల్ సౌజన్యంతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మైదానంలో ఈ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మానవత సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. ముక్కు, చెవి, గొంతు, కీళ్ల నొప్పులు, గైనకాలజిస్ట్, ఆర్థోపెటిక్, జనరల్ తదితర డాక్టర్లు పరీక్షలు నిర్వహించార మానవత మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఎంపిడిఒ సైతం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో గెడ జోగేంద్ర ప్రసాద్, జిల్లా రక్త నిధి డైరెక్టర్ జోడాల వెంకట్, కృపవరప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమం జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కొవ్వూరు

ఈనెల 12న వైసిపి చేపట్టే 'ప్రజా ఉద్యమం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. న్నారు. మంగళవారం వాడపల్లిలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వీటినితిప్పి కొట్టాలని సూచించారు. దీనిలో భాగంగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. బుధవారం పార్టీ ఆదేశాల మేరకు కొవ్వూరులో నిర్వహించే ప్రజా ఉద్యమం ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంపాటి సురేష్‌కుమార్, నాయకులు పరిమి సోమరాజు, కవల నాగేశ్వరరావు, అల్లం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆదాయ వనరుల పెంపుపై శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు హాజరయ్యారు. ఓన్ సోర్స్ రెవెన్యూ అంటే ప్రభుత్వ గ్రాంట్లు, అప్పులు పొందకుండా, పంచాయతీ తనంతట తాను ఆదాయం సమకూర్చుకోవడం అన్నారు. పంచాయతీల్లో కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు పన్నులు వేయడం, చేపల చెరువులు, కొబ్బరి ఫల సాయములు, ఇతర వేలం పాటలు, దుకాణాలకు లైసెన్సుల మంజూరు ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ కె.ఆంజనేయశర్మ మాట్లాడుతూ పంచాయతీలు ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలన్నారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న చెరువులు, స్థలాల వివరాలు సేకరించి, పంచాయతీ తీర్మానం ద్వారా వాటికి వేలం నిర్వహించాలన్నారు. చెరువుల్లో తామర పువ్వులు, తామర ఆకులకు వేలం నిర్వహించి ఆదాయం సమకూర్చుకోవచ్చున్నారు. కాల్దారి కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాల నుంచి పన్నులు వసూలు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి వివివిఎస్. రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : మండల పరిషత్ కార్యాలయంలో సొంత ఆదాయ వనరుల అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు రెండు రోజుల శిక్షణను నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొంతంగా ఆదాయాన్ని సమకూర్చే వనురులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి జ్యోతి, మాస్టర్ ట్రైనర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు

పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని పదవ తరగతి పరీక్షలను నిర్వహించే కేంద్రాలను మంగళవారం జిల్లా ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎం. అమలకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా అమల కుమారి మాట్లాడుతూ మండలంలో ఐదుఉ పదో తరగతి పరీక్షా కేంద్రాలున్నాయన్నారు. ఈ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, ఇతర వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చామన్నారు. పిల్లల పర్సెంటేజ్ పెంపొందించే విధంగా ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం.గైరమ్మ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ శివకుమార్, సిఆర్‌పిలు ఉమామహేశ్వరరావు, రాజ్‌కుమార్, చిన్నిబాబు పాల్గొన్నారు.



హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అమలకుమారి

నేరాలు ఘోరాలు


గంజాయితో పట్టుబడ్డ వ్యక్తితో పోలీసులు

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆర్‌పిఎస్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, జిఆర్‌పి ఎస్ఐ వాసు ఆధ్వర్యంలో ట్రైన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిట్టు కుమార్ యాదవ్ అనే యువకుడి గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి బుధవారం విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

బస్సు చక్రం కింద పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాత్తు బస్సు చక్రం కింద పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వెలిచేరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వెలిచేరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి రాజు, సురేఖ దంపతులకు కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉదయ పవన్ ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌లో ఎల్‌కెజి చదువుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం కుమారుడు పవన్‌ను బస్సు ఎక్కించేందుకు తల్లి సురేఖ రోడ్డు వద్దకు వచ్చింది. ఆమె కుమార్తె హరణి వరలక్ష్మి తల్లి వెనకాల వచ్చింది. కుమార్తె వచ్చిన విషయం తల్లి గమనించలేదు. కుమారుడు పవన్‌ను బస్సు ఎక్కించడంతో బస్సు ముందుకు కదిలింది. వెనుక వైపు హరణి ఉన్నట్లు డ్రైవర్ గుర్తించకపోవడంతో బస్సు ఎడమవైపు వెనుక భాగం చక్రం కింద చిన్నారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో చిన్నారి హరణి అక్కడికక్కడే మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ ఎస్.రాము సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులో తీసుకొని బస్సును పోలీస్ స్టేషన్ తరలించారు. హరిణి తల్లి సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం కోదండ రామాలయం సమీపంలో బైకు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలానికి చెందిన బోణం సూర్యనారాయణ(70) రాజానగరంలో సోదరుడిని చూసేందుకు సోమవారం వచ్చాడు. తిరిగి ఇంటికి నడిచి వెళుతుండగా రావుల చెరువు గట్టు కోదండ రామాలయం సమీపంలో బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ తలకు బలమైన గాయమైంది. వెంటనే అతన్ని రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ జివివి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాకినాడలో లారీ దగ్ధం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలోని ప్రతాప్ నగర్- సామర్లకోట రోడ్డు జెడ్ బ్రిడ్జి సమీపంలో లారీ దగ్ధమైంది. హైదరాబాదు నుంచి కాకినాడకు వెళ్తున్న లారీలో హోర్డింగ్ ఏర్పాటుకు సంబంధించి హైడ్రోజన్ పరికరాలలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మంగళవారం రాత్రి చిరునామాను అడిగేందుకు డ్రైవర్ బషీర్, క్లీనర్ బాలరాజు లారీ నుంచి దిగిన తరువాత ఈ ప్రమాదం జరిగింది. లారీ నుంచి వచ్చిన మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. అయితే అప్పటికే ముందు వెనుక భాగం పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణను అగ్నిమాపక, పోలీస్ అధికారులు చేస్తున్నారు.

ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్య అనేది ప్రతి ఒక్కరి జన్మహక్కు అని,దేశంలో విద్యా వ్యవస్థను స్థాపించిన వ్యక్తి 'మౌలానా అబుల్ కలామ్ ఆజాద్" అని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ.. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి భారత ప్రభుత్వంలో దాదాపు 11 ఏళ్ల పాటు విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి అన్నారు. ఆయన పుట్టిన రోజును "జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ సిబ్బంది, డిఇ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అబుల్‌కలామ్ ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న డిఇఒ

ఖాతాదారుల నమ్మకంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఏ వ్యాపార సంస్థ అయినా అభివృద్ధి సాధించాలంటే ఖాతాదారులు నమ్మకంపైనే ఆధారపడి ఉంటుందని తాళ్లపూడి యూనియన్ బ్యాంక్ మేనేజర్ వి.నాగరాజు అన్నారు. దేశంలోనే 5వ జాతీయ బ్యాంకుగా అవతరించడంతోపాటు యూనియన్ బ్యాంక్ 107 వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం బ్యాంకులో సిబ్బంది ఖాతాదారులతో కలిపి వేడుకలు నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం మేనేజర్ మాట్లాడుతూ తాళ్లపూడి బ్యాంకు శాఖ ఏర్పాటు చేసి 57ఏళ్ల అయ్యిందన్నారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంతోపాటు ఖాతాదారుల కుటుంబాలకు రక్షణగా ఉండే విధంగా తక్కువ ప్రీమియంతో బీమా పాలసీలు కూడా అందజేస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో సబ్ మేనేజర్ కిరణ్, సిబ్బంది చంద్రలేఖ, ప్రశాంతి, శాస్త్రి, కన్నయ్య, నటరాజ్, శ్రీను, మహేష్, తాళ్లపూడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ప్రమోద్ కుమార్, రైస్ మిల్లర్లు రంగబాబు, రమేష్, సూరిబాబు ఇతర ఖాతాదారులు పాల్గొన్నారు.


పట్టుబడ్డ గంజాయి తో రైల్వే పోలీసులు

మార్గానికి బెస్ట్ కస్టమర్ పురస్కారం

ప్రజాశక్తి-కడియం

బ్యాంకింగ్ రంగంలో అత్యుత్తమ గుర్తింపు కలిగిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బెస్ట్ కస్టమర్ పురస్కారానికి ఎపిఐఐసి డైరెక్టర్, శ్రీ వీర హనుమాన్ నర్సరీ అధినేత మార్గాని సత్యనారాయణ ఎంపికయ్యారు. యుబిఐ 107వ వార్షికోత్సం సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో ఆయన పురస్కారం అందుకున్నారు. రీజినల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మనోజ్ ఆయనకు పురస్కారం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎం విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నిబద్ధత కనబరిచే వినియోగదారులను ఎప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. . గతంలో కూడా మార్గాని తమ బ్యాంకు రంగం నుంచి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు. ఈ సత్కార కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ కడియం శాఖ మేనేజర్ సుభాష్ ఉన్నారు.


పురస్కారం అందుకుంటున్న మార్గాని

ఎఫ్ఎఫ్‌సి ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - గోపాలపురం

ఫ్లాట్టెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సి)ల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, కొవ్వూరు ఆర్‌డిఒ రాణిసుస్మిత తెలిపారు. మంగళవారం చెరుకుమిల్లిలో ఎస్ఎఫ్‌సి భవన నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం ఎఫ్ఎఫ్‌సిలను నిర్మిస్తుందన్నారు. చెరుకుమిల్లిలో 13 ఎకరాల్లో ఎఫ్ఎఫ్‌సి భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్య నారాయణ, ఎంపిడిఒ జి.రాజ్‌మనోహర్, తహశీల్దార్ ఎంవి.సాయిప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు కొర్లపాటి రాము, నాయకులు గద్దె హరిబాబు, కాకర్ల రామ తులసి, జగదీష్, ముత్యాల రాయుడు, ఎం.శ్రీనివాస్, జ్యేష్ట శ్రీధర్, ఎం.వివేక్, పంచాయతీ కార్యదర్శులు కబీర్, సిహెచ్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చంద్రవరం శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 తేదీ వరకూ జరుగుతాయని గ్రంథాలయ అధికారి కె.సుమన్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రంథాలయ ప్రాంగణంలో ప్రతిరోజూ విద్యార్థులకూ, పాఠకులకూ పలు కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తామన్నారు. 20వ తేదీన జరిగే ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. దీన్ని విజయవంతం చేయాలని పాఠకులు, విద్యార్థులు, స్థానికులను కోరారు.

శ్వాస కోశ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో నేటి నుంచి శ్వాసకోశ వ్యాధుల నివారణపై అవగాహన, సర్వే నిర్వహించనున్నట్టు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు ప్రతీ ఇంటిని దర్శించి ఐదేళ్లలోపు పిల్లలను పరీక్షిస్తారన్నారు. అవసరమైన వారికి చికిత్స అందిస్తారని తెలిపారు. ఇంటింటికి వచ్చే ఆశా కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని కోరారు.

అఖిల పక్ష సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మున్సిపాలిటీ డైమండ్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణపై అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని, మాజీ కౌన్సిలర్ పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు మంత్రి కందుల దుర్గేష్, ఎంపి స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పాలక వర్గం డైమండ్ జూబ్లీ ఉత్సవాలు జరపాలని తీసుకొన్న నిర్ణయాన్ని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం స్వాగతిస్తుందని, అయితే ఈ ఉత్సవాల్లో పట్టణ ప్రజలను, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు మాజీ ప్రజా ప్రతినిధులు, మేధావులు అందర్నీ భాగస్వాములను చేయాలన్నారు. ఐదేళ్ల పాలన చేసినంత మాత్రాన ఏక పక్ష నిర్ణయాలు ఆమోదయోగ్యం కాదని, పట్టణం ప్రజలందరి ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరగాలి అంటే అందర్నీ భాగస్వాములను చేస్తేనే సాధ్యమన్నారు. తక్షణమే అఖిల పక్షం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


అందెశ్రీకి నివాళులర్పిస్తున్న శ్రీవిజేత విద్యార్థులు

అందెశ్రీకి శ్రీవిజేత విద్యార్థుల నివాళి

ప్రజాశక్తి - తాళ్లపూడి

రచయిత వాగ్గేయ కళాకారుడు అందేశ్రీ రచించిన కవితలు మరువలేనివని తాళ్లపూడి లోని శ్రీ విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్ఎం డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ అన్నారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ క్రమంలో అందెశ్రీ రచించిన గీతాలను ప్రమోద్‌కుమార్ పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్డెన్ నంది అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెఎసి ప్రెసిడెంట్ ఓబద్య అధ్యక్షతన బైబిలు మిషన్ చర్చిలో మంగళవారం ఎఫ్రాయీము గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్, ఇటీవల తెలంగాణా ప్రభుత్వం నుంచి గోల్డెన్ నంది అవార్డు పొందిన బిషప్ డాక్టర్ విలియమ్స్, ఆయన కుమారుడు డాక్టర్ మనష్షేబాబులకు ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు నిడదవోలు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నిస్సహాయకులకు తమ ట్రస్టు నుంచి సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పాస్టర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.మనోహర్, సెక్రటరీ ఎం.మార్క్, ట్రెజరర్ కె.ఫిలిప్స్, గౌరవ అధ్యక్షులు ఎం.కుమార్, ఆర్.మార్క్, జి.మధుబాబు, జి. రాహుల్ బాబు, సంతోష్, బంగార్రాజు, శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



నిలిచిపోయిన బస్సు, వెళ్లిపోతున్న ప్రయాణికులు

బండి కాదు... మొండి ఇది...

ప్రజాశక్తి - గోపాలపురం

బండి కాదు.. మొండి ఇది.. అనే పాట గుర్తుకు వస్తుంది జిల్లాలోని ఆర్‌టిసి బస్సులను చూస్తుంటే. కాలం చెల్లిన బస్సులనే ఇంకా నడపడంతో అవి మధ్యలో నిలిచిపోతున్నాయి. మంగళవారం గోపాలపురంలోని చెక్‌పోస్టు సెంటర్ వద్ద కొవ్వూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గేర్ రాడ్డు విరిగిపోవడంతో డ్రైవర్ బస్సును నిలిపివేశాడు.


చెక్కులను అందిస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను జనసేనపార్టీ నాసేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి మంగళవారం అందించారు. మండలంలో మొత్తం 9 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను అందించాఉరు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర ప్రజాప్రతినిధులు

పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. మంగళవారం యాంకరేజ్ పోర్ట్ వద్ద జిల్లా పరిశ్రమలు, ఎపిఐఐసి ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశ్రమలు - ఉపాధి కల్పన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి, పెదఈర్లపాడు నుంచి జిల్లాలోని 4 ఎంఎస్ఇలకు వర్చువల్‌గా శంఖుస్థాపన చేశారు. అనంతరం కాకినాడ పోర్టులో ఎంఎటి మెరైన్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ, పెద్దాపురంలో సంతోషిమాత కారుగేటర్స్ పరిశ్రమ, తునిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు శిలాఫలకాలను మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లిన పర్యటనల ద్వారా రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాం న్నారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు పరిశ్రమలు ఎంతో కీలకం అనే విషయాన్ని గుర్తించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో సిఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అను కూలంగా ఉండేలా పాలసీలు తీసుకొచ్చి సబ్సిడీలు ఇస్తుందన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ సిఎం, డిసిఎం మార్గదర్శకత్వంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు నూరు శాతం కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గడిచిన ఆరు నెలలుగా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులు ఒకటి పెండింగ్‌లో లేదన్నారు. ఇందుకు ప్రతి నెల సమావేశాలు నిర్వహించి పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపి తంగేళ్ల ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధిని కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేలా వివిధ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ అమరావతికి క్వాంటం వ్యాలీ, విశాఖ పట్నణానికి ప్రసిద్ధ గూగుల్ వంటి గొప్ప సమస్థలను తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం మాట్లా డుతూ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకు రావడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో పాటుప డుతుందన్నారు. ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గతంలో బోట్లు మరమ్మతులు, తయారీకి ఇక్కడి మత్స్యకారులు ఇతర ప్రదేశాలకు వెళ్లే వారని, ఇకపై ఆ పరిస్థితి లేకుండా బోటు యార్డును నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, పరిశ్రమల శాఖ జిఎం సిహెచ్.గణపతి, తహశీల్దార్ వి.జితేంద్ర, పోర్ట్ అధికారి ధర్మశాస్త్ర, ఎంఎటి మెరైన్ సెక్రెటరీ జెఎన్‌వి.ప్రసాద్‌రాజు, సంతోషిమాత ప్యాకింగ్ ప్రయివేట్ లిమిటెడ్ జిఎం పివి.వెంకట రత్నం, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ


ఆందోళనకు మద్దతు ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాలేజీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఇంటర్ సెకండ్ విద్యార్థి శంకర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. న్యాయం కోసం విద్యార్థి కుటుంబ సభ్యులు చేస్తున్న ధర్నాకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, నగర కార్యదర్శి పి.సత్యం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని లక్ష్మీనారాయణ నగర్‌లో సోమవారం జరిగిన కళాశాల బస్సు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి మృతి చెందడం బాధాకరమని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల బస్సులు విద్యార్థుల ప్రాణాల బలి తీసుకుంటున్న అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యా సంస్థలు నడిపే బస్సుల ఫిట్నెస్‌పై ప్రభుత్వం పగడ్బందీగా తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు కళాశాలకు పెట్టుకునేటువంటి బస్సు ఏజెన్సీలు అర్హత ఉందో లేదో చూసి నిర్వహించాలని అన్నారు. మృతిని కుటుంబానికి ప్రభుత్వం తగిన రీతిలో న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహకార కార్యదర్శి సిహెచ్. లోవరాజు, జిల్లా కమిటీ సభ్యులు పి.జైరామ్ పాల్గొన్నారు.

మడ అడవులను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం తూరంగి పంచాయతీ, పరిసర ప్రాంతాల్లో ఉన్న మడ అడవుల ప్రాంతాన్ని సిపిఎం బృందం ఆ పార్టీ నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు నాయకత్వంలో పరిశీలించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన మడ అడవులను ప్రభుత్వం సంరక్షించాలని అన్నారు. సర్వే నంబర్ 2018లో ప్రభుత్వ డ్రెయినేజీలపై నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని, మడ అడవులకు వెళ్లే దారి మార్గంపై నిర్మించిన గోడలను తక్షణం తొలగించాలని కోరారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రియల్టర్లు చేపడుతున్న అక్రమ వెంచర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మడ అడవుల ఆక్రమణలపై కలెక్టర్ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జరుగుతున్న ఆక్రమణలపై చర్చించేందుకు త్వరలోనే కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్లను సిపిఎం బృందం కలుస్తుందన్నారు. ఈ పర్యటనలో చింతపల్లి అజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, తొట్టిపూడి రాజా, అంకం సుబ్రమణ్యం, జె.అప్పారావు, మణికంఠ పాల్గొన్నారు.


వివరాలను తెలుసుకుంటున్న సిపిఎం బృందం

'నిబద్ధత గల నాయకుడు ముద్రగడ'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రాజకీయాల్లో నిబద్ధత గల నాయకుడు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అని మాజీ ఎంపి వంగా గీతా అన్నారు. మంగళవారం కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబు పాలనలో ఒక్క మెడికల్ కాలేజ్ తీసుకురాకుండా వైఎస్.జగన్ తెచ్చిన కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.